క్లుప్తంగా

రేపు పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వంగా గీత చేతులమీదుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పెంచిన పింఛన్లు, కొత్త పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు. కొత్తగా 121 పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. ఉదయం ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పింఛనుదారులు హాజరు కావాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులైన వారుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


చక్రధర్ (ఫైల్)

సామర్లకోట: స్థానిక అచ్చంపేట ఏడీబీ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన ఇనకోటి చక్రధర్ (63) స్కూటీపై ఏడీబీ రోడ్డులో అచ్చంపేటలోని ఆయుర్వేద ఆస్పత్రి వద్ద మందులు తీసుకొవడానికి మంగళవారం వస్తున్నాడు. సామర్లకోట నుంచి అచ్చంపేట ఏడీబీ రోడ్డులో కాకినాడ వైపు వెళ్తున్న కారు మెడికవర్ ఆస్పత్రి వద్ద ఎదురుగా వస్తున్న స్కూటీపై ఉన్న వ్యక్తిని ఢీ కొంది. దాంతో గాయపడిన చక్రధర్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు. కారు డ్రైవరు నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన

సామర్లకోట: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు వినతి పత్రం అందజేశారు. సంఘ అధ్యక్షుడు మచ్చా శ్రీను, సీపీఐ నాయకులు పెదిరెడ్డి సత్యనారాయణ, ఎలిశెట్టి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి లక్ష పుష్పార్చన


సామర్లకోటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం

సామర్లకోట: స్థానిక బళ్లమార్కెట్ సెంటర్‌లోని కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి గురువారం లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. అమ్మ ప్రసాదంగా సమర్పించిన లడ్డు, కర్పూర దండ, 4 చీరలు వేలం వేస్తున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గ్రంధి వాసు, పెద్దిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. సాయంత్రం అఖండ దీపారాధన, నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వితరణ ఉంటాయన్నారు. మార్గశిరమాసం సందర్భంగా ఆలయంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అయోధ్యలో శ్రీరామ జన్మభూమిలో ఆలయ ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ తరపున కటకం సతీష్, సురేష్‌ల సౌజన్యంతో 22న రామదండు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. కాగా మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

న్యాయవాదుల రిలే దీక్షలు

కొత్తపల్లి: ఏపీ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని రద్దు చేసే వరకూ పోరాడతామని పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు పేర్కొన్నారు. నిరాహార దీక్షలతో పాటు ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. పిఠాపురం కోర్టు వద్ద న్యాయవాదులు బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ చట్టం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, ప్రతినిధులు ఎస్ఎం అలీ, కేఎస్ఆర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణ స్వామి ఆలయ హుండీల లెక్కింపు

రూ.3.25 లక్షల ఆదాయం

కాకినాడ రూరల్: జిల్లాలో పురాతన ప్రసిద్ధి గాంచిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో హుండీలను దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు బుధవారం లెక్కించారు. కాకినాడ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర పర్యవేక్షణలో ఈఓ భీమశంకర, ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు హుండీలను భక్తులు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు లెక్కించారు. హుండీల ద్వారా రూ.3,25,362 ఆదాయం లభించినట్టు ఈఓ తెలిపారు. సభ్యులు జోకా సత్తిబాబు, ఘంటసాల బద్రీనారాయణ, పుల్ల వీరవెంకట సత్యనారాయణ, పారాయణం భక్తులు, అర్చకులు, పుల్ల స్వాములు, ఘంటసాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాకినాడను గిఫ్ట్‌గా ఇస్తాం

- సమర్థుడైన జగన్ ఆధ్వర్యంలో పనిచేయడం అదృష్టం
- అబద్ధాల చంద్రబాబు, పవన్‌లను నమ్మొద్దు
- సీఎం బహిరంగ సభలో ఎమ్మెల్యే ద్వారంపూడి



వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల, ఎంపీ గీత తదితరులు

కాకినాడ: వై నాట్ 175/175 అన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలో భాగంగా వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ద్వారా సీఎంకు కాకినాడను గిఫ్ట్‌గా ఇస్తామని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి హామీని అమలు చేసిన ఓ సమర్థుడైన సీఎం జగన్ ఆధ్వర్యంలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. స్థానిక ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి సీఎం సమక్షంలో మాట్లాడారు.

2024లో మొట్టమొదటి సమావేశానికి కాకినాడ పట్టణానికి వచ్చిన జగనన్నకు హ్యాపీ న్యూ ఇయర్ అని ద్వారంపూడి అన్నారు. మాట మీద నిలబడే నాయకుడి ఆధ్వర్యంలో పనిచేయడం మా అదృష్టమని, రాజకీయ నాయకుడంటే ఇలా ఉండాలని నిరూపించినది మన జగనన్న అన్నారు. మాతో పాటు రాష్ట్ర ప్రజలు కూడా అదృష్టవంతులు. 2019లో నేను ఎమ్మెల్యే అయ్యే సమయానికి 14,700 పింఛన్లు ఉండేవి. ఇప్పుడా పెన్షన్లు సుమారు 29,100 మందికి ఇస్తున్నాం. అదీ ప్రభుత్వమంటే. గతంలో పెన్షన్ మంజూరు కావాలంటే ఎవరైనా చనిపోవడమో, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే సాధ్యమయ్యేదని ఆయన అన్నారు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా తొలగి పారదర్శకంగా, అర్హతే ప్రాతిపదికగా పింఛన్లు ఇస్తున్నారు. మాట ఇచ్చిన ప్రకారం రూ.3,000 పింఛన్ పెంచారు. ఇచ్చిన హామీ మేరకు జనవరిలో వైఎస్సార్ చేయూతతో పాటు మరెన్నో పథకాల లబ్ధిని నేరుగా ఖాతాల్లో వేసేందుకు సిద్ధమవుతున్నారంటూ ఎమ్మెల్యే ద్వారంపూడి పేర్కొన్నారు.

'బాబు' పేరుతో ఒక్క పథకమైనా ఉందా?

ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రులుగా పనిచేసిన ప్రతి ఒక్కరూ పాలనలో తమదైన ముద్ర వేసుకున్నారని, చంద్రబాబు పేరుతో మాత్రం ఒక్క పథకమైనా లేదని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఎన్టీఆర్ పేరిట రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం. వైఎస్సార్ పేరుతో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఉన్నాయి. జగనన్న అమ్మఒడి, చేయూత, పింఛన్లు, ఆసరా వంటి మరెన్నో పథకాలు పెట్టి పేరుతెచ్చుకుంటే, 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు పేరుతో ఒక్క పథకమైనా ఉందా అని నిలదీశారు. వైఎస్సార్ లేకపోయినా ఆయన పెట్టిన పథకాలను ఏ ప్రభుత్వం తొలగించలేదని, అదీ ఆయన సమర్థత అన్నారు. ప్రజలకు అబద్ధాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి అందరినీ మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. ఇలాంటి వ్యక్తిని బంగాళాఖాతంలో కలిపినా తప్పులేదంటూ వ్యాఖ్యానించారు. అవినీతికి, లంచాలకు తావులేని పారదర్శక పాలన ఏపీలో కొనసాగుతోందని, ప్రజలంతా పూర్తి సంతృప్తిగా ఉన్నారన్నారు. ఇంత మంచి చేసిన ముఖ్యమంత్రికి ప్రజలంతా జేజేలు పలకాలని పిలుపునిచ్చారు. జగనన్న ఏ మీటింగ్‌కు వెళ్లినా నా వల్ల లబ్ధి జరిగి ఉంటేనే మళ్లీ నన్ను ఆశీర్వదించండి అంటూ కోరుతున్నారని, అదీ ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. రాబోయే 90 రోజులు జగనన్న కోసం పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చంద్రబాబు, పవన్‌బాబు, లోకేష్‌బాబు వంటి ఎంతమంది బాబులు వచ్చినా నమ్మొద్దని కోరారు. మీ ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి ఆదరించాలన్నారు. ఈ 90 రోజులు చాలా మాయ మాటలు చెబుతారని, కుట్రలు చేస్తారని వీటిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు.




వైఎస్సార్ పింఛను కానుక రూ.3000 పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి బుధవారం కాకినాడ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లోని హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న ఎంపీ వంగా గీత, ఆమె భర్త కాశీ విశ్వనాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, కొత్తపల్లి జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుబ్బల తులసీకుమార్







'భవిత' బంగారం

- దివ్యాంగ విద్యార్థులకు భవిత కేంద్రం సేవలు
- ఉచితంగా ఫిజియోథెరపీ చికిత్సలు

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రం వారి జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దుతోంది. విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు అందరితో సమానంగా జీవించగలిగేలా బతుకుకు భరోసానిస్తున్నాయి.

శిక్షణ ఇలా..

నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట మండల కేంద్రాల్లో ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. సుమారు 30 మంది చిన్నారులకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఫిజియోథెరపీ శిక్షణ ఇస్తున్నారు. మందబుద్ధి, దృష్టి, వినికిడి లోపాలు కలిగిన విద్యార్థులకు స్పీచ్ థెరపీ, బ్రెయిలీలో శిక్షణ ఇస్తున్నారు. ఐఈఆర్‌పీ (ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్)లను చిన్నారుల ఇంటికి వెళ్లి, ఫిజియోథెరపీ చేసేలా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ ద్వారా శిక్షణ ఇచ్చి మాటలు వచ్చేలా చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీలు..

ఇక్కడి విద్యార్థులకు ప్రభుత్వం పలు రాయితీలు అమలు చేస్తోంది. రవాణా ఖర్చులకు ప్రతినెలా రూ.300, భద్రతగా వచ్చే తల్లిదండ్రులకు రూ.250 రాయితీ అందిస్తోంది. అవసరమైన పరికరాలు, ఆట వస్తువులు ఉచితంగా అందజేస్తోంది. మధ్యాహ్న భోజనం, దుస్తులు, వినికిడి యంత్రాలు వీల్ చైర్లు తదితర వస్తువులను ప్రభుత్వమే సమకూరుస్తోంది.


పెద్దాపురం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓలు (ఫైల్)

చాలా వరకు నయమైంది



మా అబ్బాయి జగదీష్ పుట్టినప్పటి నుంచీ మూగ, చెవుడుతో ఇబ్బంది పడుతున్నాడు. భవిత కేంద్రంలో స్పీచ్, ఫిజియో థెరపీ చేయించాం. ఇప్పుడు చాలా వరకు నయమైంది. గత నాలుగేళ్లు భవిత సేవలను వినియోగించుకుంటున్నాం.

– పల్ల లలిత, కట్టమూరు, పెద్దాపురం మండలం

మార్పే లక్ష్యం



విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల్లో మార్పే లక్ష్యంగా పని చేస్తున్నాం. తోటి సాటి విద్యార్థుల్లా వారు కూడా ఉండాలని శిక్షణ ఇస్తున్నాం. పాఠశాలలో చేరిన విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వారి పనులు వారు చేసుకునేలా సంసిద్ధం చేస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయుడు, పెద్దాపురం

సావిత్రీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

పెద్దాపురం: విద్యావేత్త సావిత్రీబాయి పూలేను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకోవాలని మహారాణీ కళాశాల ప్రిన్సిపాల్ టి.వీరయ్య చౌదరి అన్నారు. సావిత్రీబాయి 193వ జయంతిని పురస్కరించుకుని కళాశాలలో బుధవారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరయ్యచౌదరి మాట్లాడుతూ మహిళల చదువుల కోసం సావిత్రీబాయి పూలే ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం కళాశాల సీనియర్ మహిళా ఉపాధ్యాయిని గాయత్రీశ్వరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, సత్యనారాయణమూర్తి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, విల్ల లక్ష్మి, లావణ్య, పుష్ప, వరలక్ష్మి, ప్రసన్న పాల్గొన్నారు.

రాష్ట్రీయ నారీ సమాజ్ ఆధ్వర్యంలో..

రాష్ట్రీయ నారీ సమాజ్ ఉపాధ్యక్షుడు పెంకే వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పద్మనాభ కాలనీలో బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఈ కరణం కళావతి, చొడిశెట్టి ప్రియదర్శిని, చంద్రముఖి, శ్రీదేవి, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.


సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

కోనపాపపేట స్కూల్‌లో ...

కొత్తపల్లి: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పొన్నాడ శివారు కోనపాపపేట మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. మహిళా చైతన్యం కోసం ఆమె చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహలక్ష్మి పాల్గొన్నారు.


కోనపాపపేట స్కూల్‌లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ: నగరపాలక సంస్థలోని విక్టోరియా వాటర్‌వర్క్స్‌లో పైప్‌లైన్‌పై నీటి మీటర్లు వేస్తున్నందున 23, 24, 25 డివిజన్లలో శుక్రవారం ఉదయం, 38, 43, 44, 45 డివిజన్లలో సాయంత్రం ఒక పూట నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం కేశనవారి వీధి, గాయత్రీనగర్, పద్మనాభనగర్, భానువారివీధి, సాయంత్రం ప్రతాప్‌నగర్, స్వామినగర్, ద్వారకానగర్, మెహర్‌నగర్, నరసన్ననగర్‌లలో నీటి సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల్లో ముందుగా మంచినీటిని నిల్వ చేసుకోవాలని ఆమె సూచించారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తామని, ఇందుకోసం 96767 70461, 97484 71415, 63013 87834 నంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఓటు ఎవరికి పడిందబ్బా.!?

- సందేహాలు నివృత్తి చేసే వీవీ ప్యాట్
- అవగాహన కల్పిస్తున్న ఎన్నికల సిబ్బంది

కాకినాడ: ఓటు వేసిన వారిలో ఒకటే సందేహం.. నేను ఏ గుర్తుకు ఓటు వేశానో వాళ్లకే పడిందా? బటన్ ఒకచోట నొక్కితే, మరొకరికి పడిందా? మన ప్రమేయం లేకుండా ఓట్లన్నీ గుంపగుత్తగా ఏదో ఒక పార్టీకే పడిపోయాయా?.. ఇలా వేసిన ఓటుపై ఓటర్లలో అనేక సందేహాలు ఏర్పడడం సర్వ సాధారణమైంది. కొన్ని రాజకీయ పార్టీలు అవగాహన లేక చేసే విమర్శల వల్ల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల పనితీరు అనేక అపోహలకు ఆస్కారం కల్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నచ్చిన వారికి ఓటరు వేసిన ఓటు దుర్వినియోగం కాదని తెలియజెప్పే ప్రయత్నం చేస్తోంది ఎన్నికల కమిషన్.

వీవీ ప్యాట్‌తో నివృత్తి

బ్యాలెట్ యూనిట్‌పై నచ్చిన అభ్యర్థికి ఓటు వేసిన వెంటనే పక్కనే ఉన్న వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫయ్యబుల్ పేపర్ ఆడిట్ ట్రిమ్) సందేహాన్ని నివృత్తి చేస్తుంది. ఓటు వేసిన ఏడు సెకండ్ల వరకు వీవీ ప్యాట్‌లో ఎవరికి వేశామో ఆ నంబర్‌ను స్క్రీన్‌పై స్పష్టంగా నిర్ధారించి చూపిస్తోంది. ఒకరికి ఓటు వేస్తే, వేరొకరికి వెళితే అక్కడే తేటతెల్లమైపోతుంది. ఇది నిర్ధారణ చేసుకుని ఓటరు బయటకు వెళ్లేందుకు ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుంది.

విస్తృత ప్రచారం

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరుపై విస్తృత ప్రచారం చేపట్టారు. కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన మెషీన్లను ఏర్పాటు చేశారు. మరో వీవీ ప్యాట్, ఈవీఎంలను రోజుకొక పోలింగ్‌స్టేషన్ వద్ద ఉంచి, ప్రజలతో స్వయంగా పరీక్షించి నిర్ధారించేలా అవగాహన కల్పిస్తున్నారు. వేర్వేరు నంబర్లకు ఓట్లు వేసి రెండు, మూడుసార్లు సందేహాన్ని నివృత్తి చేసేలా ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ విధానానికి ప్రజల్లో మంచి స్పందనే కనిపిస్తోందని అక్కడ ఉన్న ఎన్నికల సిబ్బంది బి.అర్జున్ చెప్పారు.


వీవీ ప్యాట్ ద్వారా వేసిన ఓటును నిర్ధారించుకుంటున్న ప్రజలు



ఓటరు వేసిన గుర్తును చూపుతున్న వీవీ ప్యాట్

సందేహాల నివృత్తికే...



వేసిన ఓటుపై ఓటరుకు ఉండే సందేహాలను నివృత్తి చేసేందుకు వీవీ ప్యాడ్ ఎంతో ఉపయోగపడుతోంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్టిన వీవీ ప్యాట్‌లో వివిధ పనులపై వచ్చే ప్రజలు స్వయంగా పరీక్షించుకుని నిర్ధారణ చేసుకుంటున్నారు. వాస్తవాన్ని తెలుసుకున్నాక ప్రజల్లో కూడా వీటి పనితీరుపై అపోహలు తొలుగుతున్నాయి. ఈ పరికరం ద్వారా నగరంలో మరిన్ని ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేస్తాం.

– సీతాపతిరావు, ఏఈఆర్వో, తహసీల్దార్, కాకినాడ అర్బన్

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

పిఠాపురం: వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పవన్‌కుమార్, సుబ్బారావు, ఈరుగుల రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్లు కె.రఘు, ప్రసాద్, వి.మహేష్, హెల్త్ శక్రటరీలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శారదా మాత జయంతి

పేద మహిళలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

సామర్లకోట: మండల పరిధిలో పీబీ దేవం గ్రామంలో శారదా మాత 171వ జయంతి వేడుకలు శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత హారతి, అష్టోత్తర శతనామ పూజ, మాతృశ్రీ శారదా మాత జీవిత చరిత్ర విశేషాల పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు శ్రీ లక్ష్మీ కల్యాణి ఎంటర్‌ప్రైజెస్ అధినేత చందువోలు వీరవెంకటసత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి నాయకులు వింజమూరి విశ్వనాథ్, నవ్వుల బాబ్జీ, మండవిల్లి వెంకట్రావు, ఆచంట సత్యనారాయణ, తోటకూర సత్తిబాబు, తోటకూర సూర్య ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాండవ్య నారాయణుని గ్రామోత్సవం


ఊరేగుతున్న మాండవ్య నారాయణుడు

సామర్లకోట: స్థానిక తుల్యభాగ గోదావరి తీరాన కొలువుదీరిన అతిపురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా సాగింది. గత నెల 16వ తేదీ నుంచి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 14వ తేదీన గోదా కల్యాణంతో ముగుస్తాయి. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గాంధీ చౌక్, చిన్నవీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మ చెరువు, మఠంసెంటర్, అయోధ్యరామపురం, కొత్తూరు మీదుగా రాత్రికి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. ఆలయ పండితులు చక్రవర్తుల రఘురామ్, రవికుమార్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థినులకు ట్యాబ్‌ల పంపిణీ


పిఠాపురంలో ట్యాబ్‌లు అందజేస్తున్న బాలిపల్లి రాంబాబు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తూ, పాఠశాలల్లో ప్రమాణాలు మెరుగుపరిచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్, సచివాలయాల కన్వీనర్ బాలిపల్లి రాంబాబు అన్నారు. పిఠాపురం పట్టణంలోని బాదం మాధవరావు జెడ్పీ స్కూల్‌లో ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను బుధవారం విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తోందని చెప్పారు. అలాగే విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్టు వివరించారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండి ఉమామహేశ్వరి, రావికావడ పోసియ్య, చింతాడ నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్వహణ బాధ్యతల అప్పగింత

కొత్తపల్లి: కొమరగిరిలో ఉన్న విశ్వేశ్వరస్వామి ఆలయ నిర్వహణ బాధ్యతలను ఆలయ అర్చకుడు కొడమంచిలి శివరామకృష్ణకు బుధవారం పిఠాపురంలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో ఈఓ బి.ధనలక్ష్మి అప్పగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక, ఆలయాల భూములకు సంబంధించి రూ.5 లక్షల ఆదాయం కన్నా తక్కువగా ఉంటే, ఆ దేవాలయ అర్చకులకు నిర్వహణ బాధ్యతను అప్పగించేందుకు నిర్ణయించింది. దీనిపై శివరామకృష్ణ దేవాదాయ శాఖకు వినతిపత్రం అందజేయగా, ఆ శాఖ కమిషనర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.